క్లుప్తంగా

ప్రభుత్వ సలహాదారు సజ్జలకు సత్కారం


రామకృష్ణారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయన్ని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు గజమాలతో సత్కరించారు. తాడేపల్లిలోని రామకృష్ణారెడ్డిని శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బడుగు రామకృష్ణ, భీమేష్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

19న చేనేత కార్మికుల ధర్నా

ఏలూరు (టూటౌన్): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 19 ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కడుపు కన్నయ్య, పిచ్చుక ఆదిశేషులు ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

18న పోతునూరులో ఉచిత వైద్యశిబిరం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 18న దెందులూరు మండలం పోతునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సర్‌సీఆర్‌ఆర్ విద్యాసంస్థల పాలకమండలి ఒక ప్రకటనలో పేర్కొంది. రోటరీ క్లబ్ ఏలూరువారి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో గుండె, ముక్కు, గొంతు, చెవి, కన్ను, పళ్లు, సాధారణ వైద్య నిపుణులు, స్త్రీ వైద్యనిపుణులు పాల్గొంటారని తెలిపింది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

18న రామకోటిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 18న ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఎంజేఎఫ్ లయన్ మానేపల్లి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. పరమహంస యోగానంద నేత్రవైద్యశాలవారిచే శిబిరం ఏర్పాటుచేస్తున్నామని, ఏలూరు నగర, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


ఎస్‌ఆర్ స్టేడియం రోడ్డు


ఏలూరు రైల్వేస్టేషన్ రోడ్డు


ఏలూరు - చింతలపూడి రోడ్డు

నగరం.. నిర్మానుష్యం


అమీనాపేట మెయిన్ రోడ్డు

జూన్ నెల 15వ తేదీ దాటినా భానుడు శాంతించడంలేదు. మృగశిర కార్తె వచ్చినా రుతుపవనాల జాడలేదు. రోజురోజుకి భానుడు తన ప్రతాపాన్ని చూపుతూ ప్రజలను ఉక్కిరిబిక్కి చేస్తున్నాడు. ఉష్ణోగ్రతలు పెరగడం, ఉదయం, రాత్రి కూడా వేడిగాలులకు వీస్తుండడంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు నానా ఆగచాట్లు పడుతున్నారు. శుక్రవారం ఎండ తీవ్రత మరీ ఎక్కువగా ఉండటంతో ఏలూరు నగరంలోని నిత్యం రద్దీగా ఉండే రోడ్లు కర్ఫ్యూను తలిపించాయి. ఉష్ణోగ్రత 43 డిగ్రీలు నమోదైంది. ప్రజలు రోడ్లపైకి రావాలంటే హడలిపోయారు. ఏలూరు నగరంలో జనసంచారం లేక రహదారులన్ని నిర్మానుష్యంగా మారాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు


నిత్యం రద్దీగా ఉండే ఫైర్‌స్టేషన్ సెంటర్ ఇలా..

భూముల రీసర్వే వేగవంతం


కొక్కిరాయిలంక పంచాయతీ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ పటాన్ని ప్రదర్శిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్ : ఏలూరు మండల గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. తహసీల్దార్, ఆర్‌ఐ, సర్వేయర్లు, వీఆర్వోలు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నారు. సచివాయ భవనం, పంచాయతీ కార్యాలయాల్లో రైతులు, ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన భూ హక్కు, భూ సురక్ష పథకం గూరించి వివరిస్తున్నారు. రైతుల భూముల వివరాలతో పాటు గ్రామ పటాన్ని ప్రదర్శిస్తున్నారు. రీ సర్వే వల్ల భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు ఉండవని వివరిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం మండలంలో పూర్తిచేసిన డ్రోన్ సర్వేలో 15 గ్రామాల విస్తీర్ణం 170 చదరపు కిలో మీటర్లుగా తేల్చారు. ఇందులో 42,752 ఎకరాల భూమి ఉన్నట్టుగా గుర్తించారు. సర్వే వివరాలను కంప్యూటరీకరించారు. డ్రోన్ సర్వే, ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్‌ఐ)తో పాటు మ్యాప్‌లు ప్రదర్శిస్తున్నారు. ఇక నుంచి ఓఆర్‌ఐ మ్యాప్ ద్వారా సులువుగా భూమి కొలతలు గుర్తించవచ్చని వివరిస్తున్నారు. రైతుల అభ్యంతరాలను నమోదు చేసుకుంటున్నారు. అనుమానాలు నివృత్తి చేస్తున్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో సరిహద్దు రాళ్లు వేయనున్నారు.


గుడివాకలంక, కొక్కిరాయిలంక మధ్య కొల్లేరు వద్ద మ్యాప్ ద్వారా భూములను పరిశీలిస్తున్న అధికారులు

అవగాహన కల్పించేందుకే



భూముల రీసర్వే రైతులు, ప్రజలకు వివరించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటన చేపట్టాం. రెవెన్యూ బృందం గ్రామాల్లో ప్రజలకు అర్థమయ్యేలా చెబుతున్నాం. ఏలూరు మండలంలోని డ్రోన్‌సర్వే పూర్తి చేశాం. త్వరలో ప్రభుత్వం ఆదేశాల మేరకు సర్వే రాళ్లు వేస్తాం. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి అయితే 99 శాతం భూ సమస్యలు ఉండవు.

– బి.సోమశేఖర్, తహసీల్దార్

ఏలూరు రూరల్ రెవెన్యూ మండల ఏర్పాటుపై హర్షం


చాటపర్రులో సీఎం జగన్, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసిన నాయకులు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గంలోని 15 గ్రామాలను రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం చాటపర్రు పంచాయతీ కార్యాలయం వద్ద సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రత్యేక కృషి వల్ల ప్రభుత్వం ఏలూరు రూరల్ రెవెన్యూ మండలాన్ని ఏర్పాటుచేసిందని, కొత్త మండలంలోని మల్కాపురం, మాదేపల్లి, శ్రీపర్రు, కలకుర్రు, కాట్లంపూడి, జాలిపూడి, చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి, కోమటిలంక గ్రామాలకు రెవెన్యూ కార్యాలయంతో పాటు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ, సర్వేయర్, సూపరింటెండెంట్‌తో కూడిన సిబ్బంది సేవలు అందిస్తుందని ఎంపీపీ తెలిపారు. ప్రజలు రెవెన్యూ సేవలు మరింత వేగంగా, సులువుగా పొందవచ్చని అన్నారు. చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయడంపై నాయకులు గుడిపూడి రఘు, తేరా ఆనంద్, మండల కొండలరావు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జయమంగళ రామరావు, మండల కొండలరావు, బొల్లిముంత రామ్మోహనరావు, కొరపాటి ప్రభుదేవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో రజకుల సంక్షేమానికి రజకుల రక్షణ చట్టం చేయాలని రాష్ట్ర రజక జన సంఘం కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏటిగట్టులోని జిల్లా రజక సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులకు రాజకీయ అధికారంలో ప్రాతినిధ్యం కల్పించాలని, రక్షణ చట్టం చేయాలని, రజకుల పిల్లలకు పాఠశాలల్లో సీట్లు ఉచితంగా ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు, పక్కాగృహాల కేటాయింపులో రజకులకు ప్రథమ స్థానం ఇవ్వాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. రజక వృత్తి చెరువులపై శాశ్వత హక్కు కల్పిస్తూ కొత్త జీఓలను జారీ చేయాలని, రజకుల విశ్రాంతి భవనాల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని, దోబీగాట్స్‌కు రూ.10 లక్షల మంజూరు జీఓను అమలు చేయాలని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు రూ.20 కోట్లు నిధులు విడుదల చేయాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా యువజన కార్యదర్శి వితాల శ్రీనివాసరావు, వట్లూరు మురళి, జిల్లా నేతలు కడెల్లి సుబ్బారావు, కొనిజర్ల నాగేశ్వరరావు, జువ్వలపాలెం సత్యనారాయణ, జాలిపూడి శేషు, అవిడ సుబ్రహ్మణ్యం, లక్ష్మీప్రసన్న, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సత్రంపాడు విద్యార్థులకు స్కాలర్‌షిప్

ఏలూరు రూరల్: సత్రంపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ సాధించారని హెచ్‌ఎం ఆర్ శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. వీరిలో పి.సాయి అఖిల, ఎం.సుశాంత్, ఎస్‌కే నఫీషా భాను, ఎం.రేఖ, పి.ధనుష్, యు.గీతిక, బి.వీరజారెడ్డి ఉన్నారని వెల్లడించారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.12 వేలు ఉపకారం అందిస్తుందని తెలిపారు. ఫిబ్రవరి నెలలో విద్యార్థులు పరీక్ష రాయగా, ఈ నెల 2న ఫలితాలు ప్రకటించారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కృషికి విద్యార్థుల పట్టుదల తోడు కావడంతో పరీక్షల్లో ప్రతిభ చాటుతున్నారని కొనియాడారు.

ప్రభుత్వ లక్ష్యం.. పేదలకు మెరుగైన విద్య


విద్యార్థులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పెదపాడు: రాష్ట్రంలో విద్యారంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం ద్వారా పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ముగ్గురు విద్యార్థులను చైర్‌పర్సన్ సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ విద్యారంగంలో జగనన్న విప్లవాత్మక పథకాల కారణంగా స్కూళ్లు నేడు విద్యార్థులతో కళకళలాడుతున్నాయని చెప్పారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు స్కూల్‌కు అవసరమైన ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం పైనే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రణాళికాబద్ధంగా నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని చెప్పారు. వట్లూరుకు చెందిన పసుపులేటి గాయత్రి 590 మార్కులతో జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ బాలికను అందరూ అభినందించారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు. వారికి నగదు బహుమతి, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బత్తుల ఏసురాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు, వట్లూరు సర్పంచ్ రత్నకుమారి, ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై హర్షం


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న రాజశేఖర్

పెదపాడు: నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లోఓల్టేజీ సమస్య తీరనున్నట్లు పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట గ్రామ పంచాయతీ శివారు వెంకటాపురంలో ఇటీవల ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారని తెలిపారు. విద్యుత్ సమస్యలు లేకుండా 63 కేవీ విద్యుత్ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసామని చెప్పారు. ఆర్వో వాటర్ ప్లాంటు పూర్తవుతోందని రాజశేఖర్ హామీ ఇచ్చారు.

అభివృద్ధిని అడ్డుకోవద్దు

పెదవేగి : అభివృద్ధిని అడ్డుకోవడం దుర్మార్గమని జగన్నాథపురం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పెదవేగి మండలం జానంపేట నుంచి జగన్నాథపురం మీదుగా ఏడో మైలు వరకు రూ.4 కోట్ల నిధులతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చొరవతో సర్వాంగ సుందరంగా రహదారి నిర్మించారు. జగన్నాథపురంలో కొందరు టీడీపీ నేతలు స్వార్థపూరిత రాజకీయాలతో రోడ్డును పాడు చేయాలనే ఉద్దేశంతో, మురుగు నీటిని రోడ్డుపై వదిలేస్తున్నారు. డ్రెయిన్ల నిర్మాణానికి సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు కృషి చేస్తుంటే వాటిని అడ్డుకుంటూ అభివృద్ధికి ఆటంకం కల్గిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలోని టీడీపీ నేతలు సుగసాని సత్యనారాయణ, సుగసాని నర్సింహారావు, పర్వతనేని శంకరం ఈ తరహా దుర్చర్యకు పాల్పడి రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారిని పాడు చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

జగనన్న సురక్షతో సమస్యలకు చెక్


అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి నాగరాణి

పెదవేగి : జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజల అన్ని రకాల సమస్యలకు చెక్ పెట్టడం జరుగుతుందని పెదవేగి మండల ప్రత్యేకాధికారి నాగరాణి అన్నారు. శుక్రవారం పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 23 నుంచి వచ్చే నెల 23 వరకు నెల రోజుల పాటు తహసీల్దార్ ఈఓపీఆర్‌డీ ఒక బృందం, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంగా, ఇలా రెండు బృందాలు రోజు విడిచి రోజు అన్ని మండలస్థాయి అధికారులతో గ్రామమంతా పరిశీలిస్తారని ఆమె చెప్పారు. ప్రజలకు అందించాల్సిన పథకాలు, పెండింగ్‌లో ఉన్న పనులను తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించి అదేరోజు ఆ పథ కం అందించేందుకు చర్యలు తీసుకొవడానికి, గ్రామ సభ నిర్వహిస్తారని, ఈ మేరకు ఒక ప్రణాళి కను రూపొందించినట్లు ప్రత్యేక అధికారిణి నాగరాణి తెలిపారు. అనంతరం ప్రతి నెలా మూడో శుక్రవారం మండల అదికారులతో సమీక్ష నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వంతో వచ్చిన ఫిర్యాదులు, కౌలు రైతు కార్డులు, పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా అవార్డులు, జగనన్న విద్యాకానుక, హౌసింగ్, ఐసీడీఎస్, పారిశుధ్యం తదితర అంశాలను ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. సచివాలయ భవనాలు పూర్తి చేసి త్వరితగతిన ప్రారంభించాలని ఆమె సూచించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	15-20
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	15
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07-10
బెండకాయలు	30	కంద	48
పచ్చిమిర్చి	80-86	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	44
బీరకాయలు	32-50	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	232
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	35
క్యారెట్	36	పాలకూర	10-12
దొండకాయలు	28	చుక్కకూర	10-12
బంగాళదుంపలు	24	తోటకూర	--
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	--
దోసకాయలు	20-22	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	30
ఏలూరు -తిరుపతి	16.00	4830	33